క్లుప్తంగా

రైతుబజార్ ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 23, వంకాయ 28, బెండ 28, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 13, కారెట్ 35. దొండ 18, ఆలు 20, ఉల్లి 13, గోకర 40, దోస 18 సొర 15, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 55, అర్వి 33, మునగ 48, చిలగడదుంప 47, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 75, కాప్సికమ్ 55. మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

4న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

సైదాబాద్: భక్తులు తమ మనోభీష్ట సిద్ధికి సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించాలని ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్ యడవల్లి శ్రీరామచంద్ర మూర్తి అన్నారు. సోమవారం ఆలయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 4న మాస పౌర్ణమి సందర్భంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే వ్రతంలో పాల్గొనే భక్తులకు ఆలయ కమిటీ నుంచి అన్ని రకాల పూజా సామాన్లు సమకూర్చడంతో పాటు వారికి అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు, భక్తులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు సెల్ నెం: 9849569626, 9849757708లో సంప్రదించాలని ఆయన కోరారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి



వికలాంగులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న బ్యాటరీ సైకిళ్లు

చాదర్‌ఘాట్: వికలాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని వికలాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి తెలిపారు. సోమవారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వికలాంగులకు ప్రభుత్వం తరపున ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వికలాంగులకు అందజేసేందుకు 200 మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లను సిద్ధం చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ పెద్దఅంబర్‌పేట, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.


వెంకటాపూర్‌లో కంటివెలుగు శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ వెంకటాపూర్‌లో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత,స్థానిక కార్పొరేటర్ భారతమ్మ ప్రారంభించారు. శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరాటే కోచ్ దామోదర్‌నాయక్

కాచిగూడ: కర్ణాటక సాహిత్యమందిర్, కాచిగూడ హెల్త్‌లీగ్‌లోని నాయక్ కరాటే శిక్షణ కేంద్రం విద్యార్థులు సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లో నిర్వహించిన 6వ నేషనల్ లెవల్ 'ఓపెన్ టూ ఆల్ స్టైల్ కరాటే అండ్ కుంగ్ ఫూ చాంపియన్ షిప్ -2023' పోటీల్లో పాల్గొని ఐదు మెడల్స్‌ను సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం కాచిగూడలో కెప్టెన్ శాంతి స్వరూప్ లీలే, కరాటే కోచ్, మాస్టర్ దామోదర్‌నాయక్‌లు ఘనంగా సత్కరించి అభినందించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



వనస్థలిపురం కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రజల అవసరాల దృష్ట్యా నియోజకవర్గంలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ. 1.80 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. సద్గురునగర్, వనస్థలిపురం కాంప్లెక్స్, హస్తినాపురం ఈస్ట్ కాలనీలలో సీసీ రోడ్లు, శ్రీ శ్రీనివాసపురం, పద్మావతి కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, అభ్యుదయనగర్ కాలనీల్లో రోడ్ల మరమ్మతుల పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నాలాల మరమ్మతు, పూడికతీత పనులు, కాలనీల్లో వరద నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 2 నుంచి రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈ ప్రజ్ఞ, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, నాయకులు కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, జగదీశ్‌కుమార్, సంజయ్‌కుమార్, కల్యాణ్, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, రాజు నాయీ, నవీద్, క్రాంతి పాల్గొన్నారు.

ఆలయ ఆధునీకరణ త్వరగా పూర్తి చేయండి



ఆలయాభివృద్ధిపై సమీక్షిస్తున్న మంత్రి సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని ప్రసిద్ధిగాంచిన ఖిల్లామైసమ్మ ఆలయ అభివృద్ధిపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఆలయాభివృద్ధి కోసం మంజూరైన కోటి రూపాయలతో చేపట్టబోయే పనులపై దేవాదాయశాఖ డీఈ ఓంప్రకాశ్ మంత్రికి వివరించారు. ఆలయ ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఆలయ కమిటీ చైర్మన్ గొడుగు శ్రీనివాస్, సభ్యులు మురళీధర్‌రెడ్డి, సునీల్ యాదవ్, వలిగొండ దీపు, ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవి సేవలో ఎమ్మెల్యే గాంధీ



ఎమ్మెల్యే దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురంలోని కుర్తాళం పీఠం, శ్రీ ప్రత్యంగిరా దేవిని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, విప్ ఆరెకపూడి గాంధీ దంపతులు దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజ లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కుర్తాళం పీఠాధిపతులు గొప్ప సిద్ధపురుషులని, ఎన్నో హిందూ ధర్మ సంరక్షణ కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వారి అనుగ్రహం వల్ల అందరికీ అమ్మవారి కృపాకటాక్షాలు లభిస్తున్నాయన్నారు. భారత దేశంలోనే ప్రసిద్ధి చెందిన మహిమాన్విత ప్రత్యంగిరా అమ్మవారి ఆలయం హైదరాబాద్ లో ఉండటం మన అందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ శ్రీనివాస్, నాగేంద్ర చౌదరి, విఠల్ శర్మ, శ్రీసాయికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డితో మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు నగరంలోని రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మహేశ్వరం గడ్డపైన కాంగ్రెస్ జెండాను ఎగరవేయాలని సూచించారు. తెలంగాణలో కూడా కర్ణాటక ఫలితాలే వస్తాయన్నారు. కేంద్రం, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకొని అధికారంలోకి వస్తోందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగట్టి చైతన్యవంతం చేయాలని నాయకులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులుప్రవీణ్, శ్రీకాంత్, యాదగిరి, హరికృష్ణ పలువురు పాల్గొన్నారు.

కొలువుదీరిన నూతన పాలక మండలి



నూతన పాలక మండలి సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ నూతన పాలక మండలి సోమవారం కొలువుదీరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, ఈఓ మురళీకృష్ణ సభ్యులతో ఆలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా కోట్ల వెంకటేష్ వాల్మీకి, ఈశంపల్లి పద్మ, పెండ్యాల కృష్ణ, సద్ది సహదేవ్, గొండ్యాల అశోక్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా అర్చకుడు యు.సుధీర్ కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కమిటీ చైర్మన్‌గా కోట్ల వెంకటేష్ వాల్మీకిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలక మండలి సభ్యులను 11వ డివిజన్ కార్పొరేటర్ చుక్క శివకుమార్, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నరేందర్ గౌడ్, దాత దామోదర్ సచిన్ సోని, విద్యాకమిటీ చైర్మన్ రాజుగౌడ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కమిటీకి ఏడాది కాలపరిమితి ఉంటుందని ఈఓ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం

దిల్‌సుఖ్‌నగర్: చైతన్య ఉన్నత పాఠశాల 1988 పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆర్‌కేపురంలోని స్పైసీహబ్‌లో జరిగింది. 35 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరి యోగక్షేమాలను ఒకరు తెలుసుకొన్నారు. పాఠశాలలో తాము గడిపిన రోజులను నెమరు వేసుకున్నారు. ఆడిన ఆటలు, చేసిన అల్లరిని గుర్తు చేసుకొని నవ్వుకుంటూ సందడి చేశారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయును పిలిచి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోటేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, అనిల్, కృష్ణ, జగదీష్, సంధ్య, కల్పన, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న చైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఇష్టానుసారంగా అనుమతులివ్వడంతో సమస్యలు: కొప్పుల



వివేకానందనగర్‌లోని ఖాళీ ప్రదేశంలోకి చేరిన డ్రైనేజీ మురుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: కనీస వసతులు కల్పించకుండా ఇష్టానుసారంగా అపార్ట్‌మెంట్లకు అనుమతులిస్తుండటంతో కాలనీల్లో సమస్యలు వస్తున్నాయని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మండిపడ్డారు. డివిజన్ పరిధి వివేకానందనగర్ కాలనీ ఫేజ్–1లో డ్రైనేజీ సౌకర్యం కల్పించకుండానే అపార్ట్‌మెంట్లకు అనుమతులిచ్చారన్నారు. అంతేకాకుండా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు కూడా ఇవ్వడంతో అపార్ట్‌మెంట్ల డ్రైనేజీ కాలనీల్లోని ఖాళీ ప్రదేశంలో చేరి స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, చర్యలు చేపట్టాలని కోరినా అధికారుల్లో స్పందన లేదన్నారు. అపార్ట్‌మెంట్లు నిర్మించిన బిల్డర్లకు లాభాలు రాగా, అపార్ట్‌మెంట్లను కొనుగోలు చేసిన వారు కష్టాలు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారుల చేతివాటంతోనే యూఎల్‌సీ స్థలంలో అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయని విమర్శించారు. కాలనీలోని రోడ్ నంబర్–2లో రోడ్డు వేస్తామని కంకరవేసి నెలలు గడుస్తున్నా నిర్మాణం పూర్తిచేయలేదని, దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వాహనాలు వెళ్లే సమయంలో కంకర రాళ్లు ఎగిరి స్థానికులు గాయల పాలవుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాలనీవాసులు బోయినపల్లి గిరికుమార్, వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజు, షణ్ముక్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని అమ్మమ్మ, మనవరాలికి గాయాలు

సైదాబాద్: రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొని అమ్మమ్మ, మనవరాలికి గాయాలైన ఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కుర్మగూడకు చెందిన యాదమ్మ (55) తన మనుమరాలు జస్మిత (12)తో కలిసి సోమవారం సాయంత్రం ఐఎస్‌సదన్ వద్ద రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. ఇద్దరికీ గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధించిన యువకుడికి 8 రోజుల జైలు

చంచల్‌గూడ: మహిళను వేధించిన ఓ యువకుడికి కోర్టు 8 రోజుల జైలు శిక్ష విధించింది. ఎస్‌ఐ శోభ తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల మాదన్నపేట పీఎస్ పరిధిలోని మాదన్నపేట మార్కెట్‌లో షేక్ ఇంతియాజ్ (30) స్థానికంగా నివసించే ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు 70 (సి) కింది కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. సోమవారం 7వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్.. నిందితుడికి 8 రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కాచిగూడ: శాస్త్ర సాంకేతిక రంగాల్లో విస్తృతమవుతున్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని జాహ్నవి విద్యాసంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్ పిలుపునిచ్చారు. జాహ్నవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల సికింద్రాబాద్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శాస్త్రీయ దృక్పథానికి విజ్ఞానాన్ని జత చేస్తే ఉజ్వల భవిష్యత్తు ముందుంటుందని విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చైర్మన్ పరమేశ్వర్, వైస్‌చైర్మన్ లక్ష్మిలు తమ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, పలు అంతర్జాతీయ రికార్డులు సాధించిన విద్యార్థిని ఘన సంతోషిణిరెడ్డి కరాటేలో పలు విన్యాసాలను ప్రదర్శించారు. ఎ.లక్ష్మి, నర్సింగ్‌రావు, రాజేష్, కళాశాల లెక్చరర్స్, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కాచిగూడ: వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు హిమాయత్‌నగర్‌లోని బాలాజీ భవన్ వద్ద ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామివారిని ఉదయం గజవాహనం, సాయంత్రం గరుడ వాహనంపై ఊరేగించారు. ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులతో పాటు స్థానిక కార్పొరేటర్ మహాలక్ష్మీరామణ్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్బర్‌బాగ్‌లో ఆధార్ నమోదు క్యాంపు ప్రారంభం

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ మసీద్‌షా మోజమ్ పార్కింగ్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఉచిత ఆధార్ క్యాంపు, ఉచిత ఓటర్ ఐడీ క్యాంపును సోమవారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల ప్రారంభించారు. అనంతరం ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మూడు రోజుల పాటు ఆధార్, ఓటర్ ఐడీ నమోదు ప్రకియ కొనసాగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, కాలనీవాసులు, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ మినాజుద్దీన్

ఘనంగా ప్రకాష్‌గౌడ్ జన్మదిన వేడుకలు



ప్రకాష్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్‌గౌడ్ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం రాత్రి నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా పాల్గొని ప్రకాష్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో సత్తాచాటిన వనస్థలిపురం విద్యార్థులు



మొదటి బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

వనస్థలిపురం: హన్మకొండలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన ఇండియా లెవల్ డ్యాన్స్ కాంపిటీషన్స్‌లో వనస్థలిపురం విద్యార్థులు సత్తా చాటారు. సుమారు 100 బృందాలు ఈ పోటీల్లో పాల్గొనగా వనస్థలిపురం సాహెబ్‌నగర్‌కు చెందిన ఎంఆర్‌పీ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. నిర్వాహకులు వారికి ఆదివారం బహుమతితో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ ఆలేటి రాకేష్ మాట్లాడుతూ, ఎక్కువ పోటీ ఉన్నప్పటికీ తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో మొదటి బహుమతి గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. విజయపురి కాలనీ ఫేస్–2లో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను సర్కిల్ డీఈ దామోదర్‌రావుతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం లచ్చిరెడ్డి మాట్లాడుతూ...రాబోయే వర్షాకాలంలో కాలనీలు వరద ముంపునకు గురికాకుండా ఇప్పటికే భూగర్భ, ఓపెన్ నాలాల పూడికతీత పనులు ప్రారంభించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శర్మ, యాదగిరి, సుబ్బారావు, నాయకులు మహేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

రెజ్లర్లపై బలప్రయోగం మానవ హక్కుల ఉల్లంఘనే'!

కాచిగూడ: తమకు న్యాయం చేయాలనీ ఢిల్లీలో శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్లపై క్రూరమైన బలప్రయోగం చేసి నిర్బంధించడం తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘన అని తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధానకార్యదర్శి నీలిమ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పాలనలో రక్షించాల్సిన పోలీసులే అమానుషంగా వ్యవహరిస్తున్నారని ఆమె మండిపడ్డారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. శాంతియుతంగా నిరసన చేస్తున్న ఆందోళనకారులను అణిచివేయడం సరికాదన్నారు.

ఇంద్రప్రస్థ కాలనీవాసుల అరెస్టు

- నిరసనలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి
- కాలనీవాసులకు మద్దతుగా జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు టీపీసీసీ అధ్యక్షుడి లేఖ



బీఆర్‌ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు



కాలనీవాసులకు మద్దతు తెలుపుతున్న ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీలో గల సామాజిక భవనంలో జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం ఏర్పాటు చేయొద్దని గత కొన్ని రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులను పోలీసులు సోమవారం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు కాలనీవాసులకు మద్దతు తెలుపుతూ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆందోళనలో పాల్గొనగా, ఆయనతో పాటు సుమారు పది మంది కాలనీవాసులను ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ అంజిరెడ్డి అరెస్టు చేసి పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా, కాలనీవాసులు సొంత నిధులతో నిర్మించుకున్న సామాజిక భవనంలో జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి ప్రశ్నించారు. ఆందోళన చేస్తున్న కాలనీవాసులకు వారు మద్దతు తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడి లేఖ...



ఎంపీ రేవంత్‌రెడ్డి రాసిన లేఖను కమిషనర్ లోకేష్ కుమార్‌కు అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఇంద్రప్రస్థ కాలనీవాసులకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మద్దతుగా నిలిచారు. ఇంద్రప్రస్థ కాలనీ సామాజిక భవనంలోని వార్డు కార్యాలయాన్ని వెంటనే తొలగించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్‌కు లేఖ రాశారు.ఈ లేఖను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి సోమవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అందజేశారు.